

కంట్రోల్ రూమ్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

వర్షం ఇబ్బందులు సమర్థంగా ఎదుర్కోవాలి

కంట్రోల్ రూమ్ తనిఖీ చేసిన కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, సెప్టెంబరు 1 :వర్షాల వల్ల ఎదురయ్యే ఇబ్బందులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాల వలన ఎదురయ్యే ఇబ్బందులను తక్షణమే పరిష్కరించేందుకు కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. మూడు షిఫ్టులలో సిబ్బందిని నియ మించి 24 గంటలు పరిస్థితి సమీక్షిస్తున్నారు కాల్‌సెంటర్‌కు వచ్చిన కాల్స్‌ను తప్పక రిజిస్టర్ చేయాలన్నారు. ఆకివీడులో వర్షపు నీరు నిలిచిపోయి ఇబ్బంది పడుతున్నామని వచ్చిన సమాచారాన్ని మున్సిపల్ కమిషనర్‌కు తెలియ జేయగా వెంటనే డ్రైనేజీలకు అడ్డుపడిన చెత్తను తొలగించడానికి చర్యలు చేపట్టార తెలిపారు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం నుంచి ఫోన్ కాల్ రాగా సంబంధిత తహసిల్దార్‌కు సమాచారాన్ని తెలియజేశామని కంట్రోల్ రూం సిబ్బంది తెలిపారు వర్షం తగ్గి సాధారణ పరిస్థితి నెలకొనే వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తెలిపారు.తణుకు మండలం దువ్వ యానాదులు నివాస ప్రాంతానికి వర్షపు నీరు చేరుకోవడంతో వారికి ఎస్టీ కమ్యూనిటీ హాల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి తరలించామన్నారు. అలాగే వీరికి అల్పాహారం, భోజనం వసతి, సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్, డీఆర్‌వో, అగ్రికల్చర్ అధికారితో పరిస్థితులపై సమీక్షించారు. పొలాల్లో నీరు నిలిచిపోతే రైతులు ఇబ్బంది పడకుండా నీళ్లను తోడేందుకు మోటార్‌ను ఏర్పాటు చేసుకుంటే డీజిల్ సరఫరా చేసేందుకు సంబంధిత తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి ముంపు కారణంగా పంట నష్టపోకుండా తక్షణ చర్యలపై రైతులకు సలహాలు, సూచనలు అందజేయాలని తెలిపారు. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు, కోఆర్డి నేషన్ సెక్షన్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సన్యాసిరావు ఉన్నారు.

అత్యవసరమైతే 100, 112కు ఫోన్ చెయ్యండి : ఎస్పీ

భీమవరంక్రైం, సెప్టెంబరు 1 : భారీ వర్షాల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా వ్యాప్తంగా వరద, ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. వర్షాల కారణంగా కాల్వలు, వాగులు, నదులు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్నాయని లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం సూచించిన పునరావాసాలకు వెళ్లాలన్నారు. పోలీసుల తక్షణ సహాయం కోసం 100, 112కు డయల్ చేయాలని, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

నేడు పాఠశాలలకు సెలవు

భీమవరంటౌన్, సెప్టెంబరు 1 : వర్షాల కారణంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, అంగన్వాడీ సెంటర్లకు సోమవారం సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు. సెలవు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

వర్షాల కారణంగా సోమవారం జరగవలసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. డివిజన్, మండల కేంద్రాల్లో కూడా కార్యక్రమాన్ని రద్దు చేశామని ప్రజలు గమనించాలని కోరారు.

గుంటూరు మీదుగా హైదరాబాద్‌కు బస్సులు

భారీవర్షాల కారణంగా నందిగామ- కోదాడ మధ్య రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడంతో ఆదివారం రాత్రి హైదరాబాద్ సర్వీసులను గుంటూరు మీదుగా పంపించారు. ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని నాలుగు డిపోలకు చెందిన 15 బస్సులను గుంటూరు, మాచర్ల, మిర్యాలగూడ, సూర్యాపేట మీదుగా హైదరాబాద్ చేరుకుంటాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ముంపులో పొలాలు



తుందుర్రులో నీట మునిగిన సార్వా వరిచేలు

జిల్లాలో 7,500 ఎకరాలు మునక


భీమవరం రూరల్, సెప్టెంబరు 1 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాల్లోని వెనుక సాగు చేసిన సార్వాసాగు వర్షపునీటితో ముంపు బారిన పడింది. జిల్లాలో 1లక్షా 90 వేల ఎకరాల్లో సార్వాసాగు జరగగా గడిచిన 10-15 రోజుల్లో వెనుక సాగుగా 7,500 ఎకరాల్లో సాగింది. దీంతో సాగు మొత్తం ముంపునకు గురైందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ముందస్తు సాగుగా ఈ ప్రాంతంలోను వర్షాలు మరింత కురిస్తే పొలాలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని, రైతులు ఆందోళన చెందుతున్నారు. సార్వా సాగు ఆదిలో మురుగు కాల్వల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. రూ.9 కోట్లతో చెత్త తొలగింపు చేపట్టడంతో మురుగుకాల్వల ద్వారా నీరు బయటకు వెళ్ళేందుకు అవకాశం ఏర్పడింది. ముంపుభారం కొంత తగ్గిందని రైతులు చెబుతున్నారు.

ఆచంట : ఆచంట వేమవరంలో నక్కల కాలువను ఆనుకుని ఉన్న పంట పొలాలు నీట మునిగి చెరువుల్లా మారాయి. రైతులు రెండోసారి నాట్లు వేశారు. అయితే భారీ వర్షాల కారణంగా మరోసారి పంట పొలాలు నీట మునగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. భారీ వర్షాలు వచ్చినపుడల్లా నక్కల డ్రెయిన్ పొంగి పొర్లడంతో కాలు వను ఆనుకుని ఉన్న పంట పొలాలు తరచూ మునిగిపోయి అన్ని విధాలా నష్ట పోతున్నామని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాళ్ళ : ప్రధానంగా కాళ్ళ, కోపల్లె, కోలనపల్లి ఏలూరు పాడు తదితర గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. మండలంలో సుమారు 3,700 ఎకరాల్లో వరి పంట సాగవుతున్నదని భారీ వర్షాలకు 291 ఎకరాల్లో వరిపొలాలు మునిగాయని ఏవో జయవాసుకీ తెలిపారు. 138 మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు తెలిపారు.



మాధవరం వద్ద ఎర్రకాల్వ వరద ఉధృతి



ఆచంట వేమవరంలో నీట మునిగిన పంట పొలాలు





కాళ్ల గాంధీనగర్‌లో కాల్వను తలపిస్తున్న వరి చేను

పొంగుతున్న ఎర్రకాలువ

తాడేపల్లిగూడెం రూరల్, : ఎర్రకాలువ పొంగుతోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎర్రకాలువ వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పరివాహక ప్రాంత ప్రజలు భయం గుప్పెట్లో జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికే వరదల దెబ్బకు ఇసుక మేటలు వేసి తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని మాధవరం, జగన్నాధపురం, ఆరుళ్ల, మారంపల్లి, గ్రామాల ప్రజలు ఎర్రకాల్వ భయంతో గడుపుతున్నారు.

ముంపు ప్రాంతాల్లో మంత్రి నిమ్మల పర్యటన

పోడూరు : వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను, ముంపు ప్రాంతాలను ఆదివారం రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. పోడూరు మండలం పెనుమదంలో రైతులతో కలిసి పరిశీలించారు. గోదావరి ఏటిగట్ల పటిష్టతకు ఇసుక బస్తాలను, సర్వేబాదులను, అవసరమైన అడ్డుకట్ట సామాగ్రి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వరద ముంపు ప్రాంతాల్లో నెలలు నిండిన గర్భిణులు, దీర్ఘవ్యాధి గ్రస్తులను, బెడ్ రెస్ట్ తీసుకుంటున్న పేషెంట్లను గుర్తించి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో జాయిన్ చేయాల్సిందగా ఆదేశించామన్నారు. సర్పంచ్ తానేటి బాబూరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామభద్రరాజు కూటమి నాయకులు ఉన్నారు.

జనజీవనం అస్తవ్యస్తం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

భారీ వర్షాలు, పొంగిన వాగులు జన జీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. మెట్ట ప్రాంతాల్లోను చెరువులకు గండి పడడంతో అనేక మంది నిరాశ్రయులయ్యారు. నూజివీడు, పెదపాడు మండలాల్లో సహాయ శిబిరాల్లో 1200 మందికి పైగా చేరారు. మరో వెయ్యి మందికిపైగా సమీప ప్రాంతాలకు చేరుకున్నారు. మరోవైపు గోదావరి ఉరకలు వేస్తోంది. పోలవరం వద్ద వరద ఉధృతి పెరిగింది. తమ్మిలేరులో వరద ఉధృతి పెరగడంతో మూడు గేట్లను ఎత్తివేశారు. తెలంగాణలో కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో కుక్కునూరుపై దాని ప్రభావం పడింది. ఏలూరు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలతో వందలాది మంది నిరాశ్రయులయ్యారు. పెదపాడు మండలంలో రామిలేరు విలయం సృష్టించింది. అప్పన్నవీడు వద్ద రామిలేరు పొంగి ప్రవహించడంతో శనివారం అర్ధరాత్రి జగనన్నకాలనీ, మరో రెండు ఎస్సీ కాలనీలను వరద ముంచెత్తింది. దీంతో తెల్లవారుజాములోపే దాదాపు వెయ్యి మందికిపైగా స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెల్లవారుజాము నుంచే దగ్గరుండి ప్రత్యేక బోట్‌ల ద్వారా స్థానికులను సహాయక శిబిరాల్లో చేర్చారు. తమ్మిలేరుకు ఎగువ ప్రాంతాల నుంచి నీరు చేరడంతో చింతలపూడి సమీపంలోని ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తివేసి దిగువకు వరద నీరు విడుదల చేయ డంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కాగా ఏలూరు వైపు వరద నీరంతా దూసుకొస్తోంది. ఆదివారం సాయంత్రం నాటికే ఏలూరులోని శనివారపు పేట కాజ్‌వే వద్ద వరద ఉధృతిగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపివేశారు. పోలవరం వద్ద గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది. గుండేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సత్యనారాయణపురం వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గత రెండు రోజులుగా భారీ వర్షాల కారణంగా నష్టాలు కొనసాగుతున్నాయి.



పెదపాడు మండలం లాల్లమూడి వద్ద హైవేపై వరద నీరు



కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాలను నిలిపివేసిన దృశ్యం

ఉప్పుటేరును కమ్మేసిన కిక్కిస, గుర్రపుడెక్క

భారీ వర్షాలకు పొంచి ఉన్న ప్రమాదం

ఆకివీడురూరల్ సెప్టెంబరు 1: కొల్లేరులోని నీటిని సముద్రంలోకి తీసుకెళ్ళేది ఉప్పుటేరు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల సరిహద్దులో కొల్లేరు నుంచి సముద్రంలోకి సుమారు 64 కి.మీ మేర ఉప్పుటేరు ప్రయాణిస్తుంది. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చే వర్షపునీరు, వరదనీటిని నేరుగా సముద్రంలోకి తీసుకెళుతుంది. ఉప్పుటేరు సామర్థ్యం 15 వేల నుంచి 20 వేల క్యూసెక్కులు. అయితే ఆకివీడు మండలం దుంపగడప సమీపంలోని ఉప్పుటేరు ప్రారంభం వద్ద ఉన్న రైల్వే వంతెనల వద్ద గుర్రపుడెక్క, కిక్కిస బాగా పెరిగిపోయి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నది. కేవలం రెండు కానాల ద్వారానే నీరు ప్రవహిస్తున్నది. రైల్వే బ్రిడ్జిల మధ్యలో సైతం కిక్కిస దట్టంగా పెరిగిపోయింది. రైల్వే బ్రిడ్జిల దిగువన దిగమర్రు- ప్రామర్రు జాతీయ రహదారి బైపాస్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న వంతెన కోసం ఉప్పుటేరును మూడువంతులు మట్టితో పూడ్చివేశారు. వంతెన నిర్మాణం పని ఆగిపోయినా ఆ మట్టిని తొలగించలేదు.దీంతో నీటి ప్రవాహం మరింత తగ్గిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొల్లేరు పరిసర ప్రాంతాల వర్షపునీరే కాకుండా, గోదావరి కాలువలు, తమ్మిలేరు, బుడమేరు నీరు కూడా ఉప్పుటేరులోకి చేరితే ఆకివీడు మండలంలోని పలు ప్రాంతాలు ముంపు బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రతి ఏటీ ఇదేవిధంగా ఆకివీడు పరిసర ప్రాంతాలు ముంపుబారిన పడుతున్నాయి. ఈ ఉప్పుటేరును డ్రెడ్జింగ్ చేసి సుమారు 30 సంవత్సరాలు అవుతుందని, డ్రెడ్జింగ్ చేస్తే నీటి సామర్థ్యం పెరుగుతుందని, దీనివల్ల ముంపు ప్రమాదం తగ్గుతుందని స్థానికులు తెలియజేస్తున్నారు. కిక్కిసను తొలగించి నీటి ప్రవాహాన్ని పెంచి ముంపు నివారించాలని పలువురు కోరుతున్నారు.





ఉప్పుటేరులో పేరుకుపోయిన గుర్రపుడెక్క... ఉప్పుటేరుపై రైల్వేవంతెన మధ్య దట్టంగా పెరిగిన కిక్కిస

రూ.40 లక్షలతో ప్రతిపాదనలు : డ్రైనేజీ డీఈ వినోద్

చినకాపవరం డ్రైన్, ఉప్పుటేరులో పేరుకపోయిన తూడు తొలగింపునకు రూ. 40 లక్షలు ప్రతిపాదనలు ఏప్రిల్‌లో పంపాం. నిధులు మంజూరు అవ్వాల్సి ఉంది. ప్రస్తుతం నీటి మట్టం మూడున్నర అడుగులుగా ఉంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం.

గ్రామమంతా రక్త పరీక్షలు చెయ్యండి

దుంపగడపలో వైద్య శిబిరాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ నాగరాణి

ఆకివీడు రూరల్ సెప్టెంబరు 1 :ముందు రోగాన్ని నిర్ధారణ చెయ్యండి. తర్వాత ట్రీట్ మెంట్ చేయండని జిల్లా కలెక్టర్ ప్రభుత్వ వైద్యులను ఆదేశించారు. ఆకివీడు మండలం దుంపగడప గ్రామంలో విష జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాన్ని పరిశీలించారు. జ్వరం వచ్చి తగ్గిపోయిన తరువాత శరీరంలో అవయవాలు కదలడం లేదని, చాలా ఇబ్బందులు పడుతున్నామని వ్యాధి బాధితులైన సర్పంచ్, ఉప సర్పంచ్‌లు కలెక్టర్ వద్ద వాపోయారు. ప్రతి ఏటా ఇదేవిధంగా ఏదో ఒక అనారోగ్యం వెంటాడుతోందని తెలిపారు. గ్రామానికి మంచినీరు అందించే పంటకాల్వలోకి ఆకివీడు శాంతినగర్‌కు చెందిన మురుగునీరు వదిలి వేశారని దీంతో తాగునీరు కలుషితమవుతున్నదని ఆమె దృష్టికి తీసుకెళ్ళారు. రోగులకు ఏ విధమైన వైద్యసేవలు అందిస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రక్తపరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చెయ్యడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం శాంతినగర్‌లో పంటకాలువలోనికి మురుగునీరు వదిలేసిన ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. తహసీల్దారు వెంకటేశ్వరరావు, ఎంపీడీవో పి.వాణి, సర్పంచ్ విశ్వేశ్వరరావు, ఉప సర్పంచ్ కొట్టునాగరాజు, వైద్యులు రమేష్, రాజశేఖర్, సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐ నాగరాజు తదితరులున్నారు. ఇదిలా ఉంటే ఆదివారం కావడంతో వైద్య శిబిరం ఏర్పాటు చెయ్యలేదని కలెక్టర్ వస్తున్నట్టు తెలిసి అప్పటికప్పుడు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు స్థానికులు తెలియజేశారు.

ఇక..ప్రైవేటు మద్యం





- ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం
- ఐదేళ్లు మద్యం పేరుతో దోపిడీ
- అద్దె షాపుల్లోనూ నొక్కుడు
- యజమానులకు రూ. 12 వేలు ప్రభుత్వం చెల్లించేది రూ. 38 వేలు
- నాసిరకం మద్యం అమ్మకాలకే పరిమితమైన ప్రభుత్వ షాపులు
- వీటన్నింటికీ చెక్ పెట్టేలా కొత్త మద్యం పాలసీ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

మద్యం అక్రమాలకు కూటమి ప్రభుత్వం చెక్ పెట్టేలా కసరత్తు చేస్తోంది. ప్రైవేటుకు మద్యం అమ్మకాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఆ దిశగా అడుగులు వేస్తోంది. దాంతో ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది ఆందోళనకు దిగుతున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి సానుకూలత లేకపోతే ఈనెల 7వ తేదీన మద్యం షాపులను బంద్ పాటించాలని నిర్ణయించారు. ఇప్పటికే సిబ్బంది ప్రభుత్వ పెద్దలను సంప్రదించారు. ప్రైవేటుకే మద్యం అమ్మకాలను ఇవ్వాలని స్పష్టం చేసినట్లు సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. వైసీపీ హయాంలో మద్యం పాలసీపైనే లెక్కకు మిక్కిలి విమర్శలు వెల్లువెత్తాయి. ధరలను అమాంతం పెంచేశారు. ప్రభుత్వ మద్యం షాపుల్లో నాణ్యమైన బ్రాండ్‌లు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నాసిరకం మద్యానికి చెక్ పెడతామంటూ హామీ ఇచ్చారు. ఆ దిశగానే ఇప్పుడు మద్యం పాలసీని సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఎక్సైజ్ అధికారుల నుంచి నివేదికలు వెళ్లాయి. అక్టోబరు నుంచి కొత్త మద్యం పాలసీ అమలులోకి వస్తుందని ఆశిస్తున్నారు.

ఐదేళ్లపాటు దోపిడీ

వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు మద్యం అమ్మకాల్లో అందిన కాడికి దోచుకున్నారు. మద్యం షాపులకు అద్దె భవనాలు తీసుకున్నారు. వైసీపీ నేతలు కుమ్మక్కయ్యారు. తక్కువ మొత్తానికి అద్దెకు తీసుకున్నారు. ప్రభుత్వానికి నెలకు రూ.38 వేలు అద్దె చెల్లించేలా భవనాలను సమకూర్చారు. వైసీపీ నేతలు మాత్రం షాపు యజమానికి రూ. 12 వేలు మాత్రమే ఇస్తున్నారు. ఇలా అద్దె రూపంలోనూ దోపిడీ సాగింది.అదే నాణ్యమైన మద్యం అమ్మకాల కోసం మాల్స్‌ను నెలకొల్పారు. తాడేపల్లిగూడెంలో ఒక మాల్‌కు ప్రభుత్వం నెలకు రూ. 1.40 లక్షలు చెల్లిస్తోంది. యజమానులకు మాత్రం రూ.33 వేలు మాత్రమే ఇస్తున్నారు. ఇలా మద్యం షాపుల వ్యవహారంలోనూ వైసీపీ నేతలు లబ్ధి పొందారు. బార్‌లలోనే కాస్త నాణ్యమైన బ్రాండ్‌లు లభ్యమవుతున్నాయి. నిల్వలు ఆధారంగా ఇండెంట్ పెట్టుకుంటే అవే రకమైన బ్రాండ్‌లను బార్‌లకు ఇవ్వాల్సి ఉంటుంది. బార్‌ల నిర్వహణలో తమ ఆశీస్సులు, సహకారం ఉందంటూ వైసీపీ నేతలు ఎన్నికల సమయంలో మద్యాన్ని ఉచితంగా తరలించుకు పోయారు. ఇలా ఎన్నో విధాలుగా దోపిడీకి పాల్పడ్డారు. వైసీపీ ప్రభుత్వ పెద్దలే వేలకోట్ల రూపాయలు పోగేసుకున్నారు.

పెరిగిన అమ్మకాలు

ఏడాది క్రితం వరకు జిల్లాలో అమ్మకాలు సాదాసీదాగా ఉండేవి.లక్ష్యాన్ని చేరుకోలేకపోయేవారు. నాణ్యమైన బ్రాండ్‌లకే జిల్లాలో ఆసక్తి చూపుతుంటారు.మరోవైపు జిల్లా ఆర్థిక వనరులు దెబ్బతిన్నాయి. ఆక్వా రంగం, వరిసాగు నష్టాల్లో పయనించింది. ఆ ప్రభావం మద్యం అమ్మకాలపైనా పడింది. ఫలితంగా రోజుకు రూ. 2.10 కోట్ల విలువైన మద్యాన్ని ప్రభుత్వ షాపుల్లో విక్రయించడం కష్టతరమైంది. అదే ఎన్నికల మూడు నెలల ముందునుంచి అమ్మకాలు అనూహ్యం పెరిగాయి. ఒక్కో రోజు అమ్మకాలు రూ. 2.50 కోట్లకు చేరిన సందర్భాలున్నాయి. ఇప్పటికీ అదే పంథా కొనసాగుతోంది. అమ్మకాలు పెరిగాయి. ప్రభుత్వం నుంచి అమ్మకాలు పెంచాలంటూ ఒత్తిడి లేదు. అయితే మద్యం పాలసీని పూర్తిగా మార్చి వేయాలని ప్రభుత్వం ఆశిస్తోంది. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతో పాటు, అమ్మకాల బెడద ఉండదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. మరోవైపు 15 శాతం షాపులను కల్లుగీత కార్మికులకు ఇవ్వనున్నట్టు ఎన్నికల ముందు కూటమి హామీ ఇచ్చింది. గతంలో మాదిరిగానే ప్రైవేటు షాపులతో పాటు, సిట్టింగ్ రూమ్‌ను కేటాయించనున్నారు. ప్రభుత్వ మద్యం షాపుల్లో విక్రయాలు సాగిస్తుండడంతో రహదారి పక్కనే మద్యం సేవిస్తున్నారు. పోలీసులకు ఇది తలనొప్పిగా మారింది. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం అధికం కావడంతో అరికట్టేందుకు పోలీసులు ఒక దశలో ఆపసోపాలు పడ్డారు. మందుబాబులను అదుపు లోకి తీసుకున్నారు. అయినా కట్టడి కాలేదు. మరోవైపు ఇతర రాష్ట్రాల నుంచి మద్యాన్ని రప్పించి అమ్మకాలు సాగించే బెల్ట్‌షాపులు వెలిశాయి. ఇవన్నీ అరికట్టేందుకు ప్రైవేటుకే మద్యం అమ్మకాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం యోచిస్తోంది. మరోవైపు నాసిరకం బ్రాండ్‌లకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. ఇప్పటికీ గతంలో ఉన్న నిల్వలనే సరఫరా చేస్తున్నారు. నాణ్యమైన మద్యం కోసం బార్లను ఆశ్రయించి అధిక ధరలతో కొనుగోలు చేస్తున్నారు.వీటన్నింటికీ చెక్‌పెట్టేలా ప్రభుత్వం ప్రైవేటు మద్యం అమ్మకాలకు ఆసక్తి చూపుతోంది. అయితే ఐదేళ్ల పాటు ప్రభుత్వ షాపుల్లో అమ్మకాలు సాగించిన సిబ్బంది ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. అప్పట్లో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులను ప్రభుత్వ షాపుల్లో నియమించారు. ప్రతినెలా వేతనం ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో తమకు ఉపాధి ఉండదంటూ ఆందోళనకు దిగుతున్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్లు

వైసీపీకి 14 మంది కార్పొరేటర్లు గుడ్‌బై

ఎమ్మెల్యే బడేటి చంటి సమక్షంలో టీడీపీ తీర్థం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 1 :ఏలూరులో వైసీపీకి మరోసారి భారీ షాక్ తగిలింది. ఇప్పటికే మేయర్ కొందరు కార్పొరేటర్లతో కలిసి ఇటీవల టీడీపీ గూటికి చేరగా తాజాగా అదేబాటలో ఆదివారం 14 మంది వైసీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్లు, మహిళా కోఆప్షన్ సభ్యురాలు వైసీపీకి ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి లేఖలు రాశారు.వీరంతా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సమక్షంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు. వీరిలో కార్పొరేటర్లు జీకనక నరసింహారావు, సబ్బన శ్రీనివాస్, తాము పద్మ, యర్రంశెట్టి నాగబాబు, గూడూరి రాజ్యలక్ష్మి, అన్నపనేని భారతి, గునుపూడి శ్రీనివాసరావు, ఉప్పల సుజాత సన్ని, కత్తిరి రామ్మోహన్‌రావు, యర్రంశెట్టి సుమన్, ఈదుపల్లి కల్యాణిదేవి, మహ్మద్ ఇలియాస్ పాషా, నున్న స్వాతి శ్రీదేవి, దేవరకొండ శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యురాలు నీతా జైన్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కాగా ఇప్పటికే కీలక నేతలు అంతా వైసీపీని వీడడంతో ఏలూరు నగరంలో దాదాపు వైసీపీ ఖాళీ అయింది. మిగతా కార్పొరేటర్లు సైతం టీడీపీ, జనసేన వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన ఆళ్ళ నాని వైసీపీకి రాజీనామా చేయడంతో నగరంలో ఆ పార్టీ కుదేలైంది. అనంతరం మేయర్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, వైసీపీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, కార్పొరేటర్ బొద్దాని అఖిలప్రియ పార్టీని వీడి టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. 50 డివిజన్లు ఉన్న నగరపాలక సంస్థకు 2021లో జరిగిన ఎన్నికల్లో 47 స్థానాలను వైసీపీ, మూడు స్థానాలను టీడీపీ దక్కించుకుంది. స్నేహపూర్వక వాతావరణంలో ఏలూరు నియోజక వర్గ అభివృద్ధికి తాను రాజీలేకుండా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 14 మంది కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యురాలు టీడీపీ క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీలో చేరారన్నారు.

15 అడుగుల విగ్రహం రూ.40 వేలు

పాలకొల్లు అర్బన్ : లజయపతిరాయ పేట భీమ వరం రోడ్డు పక్కగా రాజస్తాన్‌కు చెందిన కళాకారుడు విక్రం పటేల్, రమేష్ 18 ఏళ్లుగా విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నాడు. అలాగే వర్ధనంకు చెందిన శిల్పి ఇంటి ప్రసాద్ లయన్స్ నగర్ ప్రాంతంలో గణనాథుల విగ్రహాలు తయారు చేస్తున్నారు. 15 అడుగుల విగ్రహం రూ.40 వేల వరకూ విక్రయిస్తున్నామని, ఇప్పటికే 100 విగ్రహాలకు ఆర్డర్లు వచ్చాయని తెలిపారు.



తాడేపల్లిగూడెం, ఆకివీడు, పాలకొల్లులో విక్రయానికి సిద్ధంగా ఉన్న గణనాథుని విగ్రహాలు

విక్రయాలు ఎక్కువగా ఉంటాయి



ఉత్సవాలు నిర్వహించాలను కునేవాళ్లు ముందస్తుగా మాకు ఆర్డరిస్తారు. ఈ సారి ఆర్డర్‌లు తక్కువగానే వచ్చాయి. సాధారణంగా చవితి దగ్గరకు వచ్చాక అమ్మే విగ్రహాలే ఎక్కువ. ఈ సారి గతంతో పోలిస్తే విగ్రహాల విక్రయాలు ఎక్కువగా ఉంటాయని ఆశిస్తున్నాం. - పుల్ చంద్ రాథోడ్, వినాయక విగ్రహాల తయారీదారుడు, తాడేపల్లిగూడెం

ఓ బొజ్జ గణపయ్యా

- చవితికి గణనాథులు సిద్ధం
- విగ్రహ తయారీ కేంద్రాలకు పెరిగిన ఆర్డర్లు









తాడేపల్లిగూడెం రూరల్/ఆకివీడు రూరల్/ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 1: హిందువులు ఎంతో పవిత్రంగా జరుపుకునే వినాయక చవితికి బొజ్జ గణపయ్యలు సిద్ధ మయ్యారు. ఈ నెల ఏడు నుంచి ప్రారంభమయ్యే ఉత్స వాలకు మండపాలలో కొలువుదీసేందుకు ముస్తాబయ్యారు. ఐదు నుంచి 16 అడుగుల విగ్రహాల వరకూ జిల్లాలోనే లభ్యమవుతున్నాయి. విగ్రహాల సైజును బట్టి రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకూ ధర పలుకు తున్నాయి. చవితి ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణ నిలిచేది విగ్రహాలే. అలాంటి విగ్రహాల ఎంపిక కోసం నిర్వాహకులు ఉత్సాహం చూపుతుంటారు. దీంతో వారికి కావాల్సిన గణపతి విగ్రహాల కోసం వెతుకులాట జోరుగా సాగుతోంది. నచ్చిన విగ్రహాలకు అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం పాలకొల్లు లాంటి పట్టణాలతో పాటు మండల కేంద్రాలైన గణపవరం, ఆచంట, యలమంచిలి, ఆకివీడు తదితర ప్రాంతాల్లోని విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. కూటమి ప్రభుత్వం ఉత్సవాల నిర్వహణకు ఎలాంటి ఆంక్షలు ఉండవని ఇప్పటికే సంకేతాలు ఇస్తుండ టంతో చవితి ఉత్సవ కమిటీల వారు ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. భారీ పందిళ్లు వేసేందుకు సిద్ధమయ్యారు. పలు సేవా సంస్థలు ఏకో గణపతి పేరుతో మట్టి విగ్రహాలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు నగరంలోని కోటదిబ్బ సెంటర్, రామకోటి ప్రాంగణం, కూరగాయల మార్కెట్, ఫిష్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో భారీ గణనాథుని మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు. గంగానది మట్టితో విగ్రహాలను కళాకారులు తయారు చేస్తున్నారు.

రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 1 : రాష్ట్రంలో భారీగా కురుస్తున్న వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో రైలు పట్టాలపైకి నీరు చేరిపోవడంతో ఎక్కడ రైళ్ళు అక్కడే నిలిచిపోతున్నాయి. మరి కొన్ని రైళ్ళు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముందస్తు ప్రయాణికుల రక్షణ చర్యల్లో భాగంగా 80 రైళ్ళను రద్దు చేయగా, ఐదు రైళ్ళు కొంత వరకు మాత్రమే రద్దు చేశారు. మరో 49 రైళ్ళను దారి మళ్ళించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి 10 గంటలకు రైల్వే అధికారుల నుంచి అందిన సమాచారం మేరకు ఏలూరు జిల్లా మీదుగా వెళ్ళే రైళ్ళు రద్దు, దారి మళ్ళించిన రైళ్ళ వివరాలు ఇలా ఉన్నాయి.

20833	విశాఖపట్టణం	సికింద్రాబాద్ ఈనెల 2వ తేదీన రద్దు
20834	సికింద్రాబాద్	విశాఖపట్టణం ఈనెల 2వ తేదీన రద్దు
20707	సికింద్రాబాద్	విశాఖపట్టణం ఈనెల 2వ తేదీ రద్దు
20708	విశాఖపట్టణం	సికింద్రాబాద్ ఈనెల 2వ తేదీ రద్దు
17206	కాకినాడ పోర్టు	సాయినగర్ శిర్డి ఈనెల 2వ తేదీ రద్దు
17205	సాయినగర్ శిర్డి	కాకినాడ పోర్టు ఈనెల 3వ తేదీన రద్దు
17209	ఎస్ఎంవీటీ బెంగళూరు	కాకినాడ టౌన్ ఈనెల 2వ తేదీన రద్దు
17717	విశాఖపట్టణం (విశాఖపట్టణం నుంచి	విజయవాడ నూజివీడు వరకు మాత్రమే)
17488	విశాఖపట్టణం (విశాఖపట్టణం నుంచి	కడప సామర్లకోట వరకు మాత్రమే)
17250	కాకినాడ టౌన్ (కాకినాడ నుంచి	తిరుపతి రాజమండ్రి వరకు మాత్రమే)

దారి మళ్లించిన రైళ్లు

విజయవాడ నుంచి నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు మీదుగా వెళ్ళే రైళ్ళను విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా దారి మళ్ళించారు. అదే విధంగా నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం, ఏలూరు, నూజివీడు, ఏలూరు మీదుగా వెళ్ళే రైళ్ళను నిడదవోలు నుంచి భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా దారి మళ్ళిస్తున్నారు.

12863	హౌరా	ఎస్ఎంవీటీ బెంగళూరు
18463	భువనేశ్వర్	కేఎస్ఆర్ బెంగళూరు
12717	విశాఖపట్టణం	విజయవాడ
18047	షాలిమారు	వాస్కోడీగామా
17488	విశాఖపట్టణం	కడప
12845	భువనేశ్వర్	ఎస్ఎంవీటీ బెంగళూరు
22504	డిబ్రుగర్	కన్యాకుమారి
12839	హౌరా	చెన్నై సెంట్రల్
22502	న్యూటిన్సుకీయ జెంక్షన్	ఎస్ఎంవీటీ బెంగళూరు
17250	కాకినాడ టౌన్	తిరుపతి
22880	తిరుపతి	భువనేశ్వర్
22808	చెన్నై సెంట్రల్	సత్రగంజి
12433	చెన్నై సెంట్రల్	నిజాముద్దీన్
22641	తిరువనంతపురం	షాలిమార్
22503	కన్యాకుమారి	డిబ్రుగర్

నరసాపురం రైళ్లు రెండు..

నరసాపురం, సెప్టెంబర్ 1: వర్షాలు, వరదల కారణంగా దక్షణ మధ్య రైల్వే ఆదివారం నరసాపురం నుంచి వెళ్లే రెండు రైళ్లను రద్దు చేసింది. వాటిలో రాత్రి ఎనిమిది గంటలకు వెళ్లే సికింద్రాబాద్ వీక్లి స్పెషల్, మధ్యాహ్నం రెండు గంటలకు వెళ్లే విజయవాడ ఎక్స్‌ప్రెస్‌లున్నాయి. సోమవారం విజయవాడ నుంచి సాయంత్రం ఐదు గంటలకు బయలు దేరే డెమో రైలును కూడా రద్దు చేస్తున్నట్లు దక్షణ మధ్య రైల్వే ప్రకటిం చింది. ఇటు ఆదివారం లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరుతున్నట్లు ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం ఈ రైలు సాయం త్రం 6.50కి బయలుదేరాల్సి ఉంది. అయితే రాత్రి 8.50కు బయలుదేరింది. మరోవైపు విజయవాడ వైపు రైళ్లన్ని రద్దు కావడంతో నరసాపురం స్టేషన్ వెలవెలబోయింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లు కూడా ఆలస్యంగా వచ్చాయి. చాల మంది హైదరాబాద్‌లో కూడా వర్షాల హెచ్చరిక జారీ చేయడంతో ఆదివారం టిక్కెట్లను రద్దు చేసుకున్నారు.

చిన్నారి జ్ఞానేశ్వరి మృతి



ఏలూరు అర్బన్, ఆగస్టు 1 : కాలేయ మార్పిడి(లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) శస్త్ర చికిత్స చేయించుకుని, నెల రోజులుగా వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఏలూరుకు చెందిన బాలిక కోటం జ్ఞానేశ్వరి తమిళనాడులోని పెరుంబాక్కం గ్లెనిగల్స్ హెల్త్ సిటీ హాస్పిటల్‌లో శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో కన్నుమూసారు. వివరాలను జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యులు తెలిపారు. కామెర్లు ముదిరడంతో కాలేయ మార్పిడి తప్పనిసరి అని వైద్యనిపుణులు తేల్చిచెప్పడం, ఆ మేరకు లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ దాతలు, ప్రభుత్వ సహకారంతో బాలిక తల్లి దుర్గ కాలేయం నుంచి 40 శాతం మేర తొలగించి గత నెల 3న అమర్చారు. అప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలో ఆస్పత్రిలోనే ఉన్నారు. కాగా మూడు రోజులుగా బాలిక అన్నవాహిక నుంచి విపరీతంగా రక్తస్రావం జరుగుతుండడంతో దానిని అరికట్టేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో శనివారం అర్ధరాత్రి తర్వాత ఆస్పత్రిలోనే జ్ఞానేశ్వరి మరణించిందని వైద్యులు తెలిపారు. బాలిక మృతదేహన్ని చెన్నై నుంచి అంబులెన్సులో ఆదివారం అర్ధరాత్రికి ఏలూరు చేరుస్తామని, సోమవారం భీమడోలులో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యు లు తెలిపారు. తన కాలేయం నుంచి కొంత భాగాన్ని కుమార్తెకు డొనేట్ చేసిన తల్లి దుర్గ కోలుకుంటోందని వివరించారు.

తీవ్రంగా కలచివేసింది : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్ : చిన్నారి జ్ఞానేశ్వరి మృతిని తనను తీవ్రంగా కలచివేసిందని ఎమ్మెల్యే బడేటి చంటి ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి క్షేమంగా తిరిగి రావాలని సీఎం చంద్రబాబుతో మాట్లాడి ఆపరేషన్‌కు అవసరమైన ఆర్థిక సహాయం అందించామని, అయినప్పటికి విధి వక్రించి మృతి చెందటం బాధకరమన్నారు. జ్ఞానేశ్వరి ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు గుండె ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నానని చంటి అన్నారు.

స్తంభించిన సెల్ నెట్‌వర్క్



ఏలూరు క్రైం, సెప్టెంబర్ 1 : సెల్ నెట్ వర్క్ సేవలు ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా నిలిచిపోయాయి. దీంతో వినియోగదారులు తమ ఫోను ఏమైందో, సిగ్నల్ ఎందుకు రావడంలేదో అంటూ స్విచ్ ఆఫ్ చేసి ఆన్ చేయగా మరి కొంతమంది రీసెట్ చేసుకున్నారు. అయినప్పటికీ సిగ్నల్ రాలేదు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో టవర్స్ పని చేయడంలేదేమోనని అనుకున్నారు. అయినప్పటికీ అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉండడంతో ఒక్కసారిగా వారు తమ ఫోన్‌కు ఏమైందో అంటూ సిమ్ కూడా బయటకు తీసి మళ్ళీ పెట్టుకో వడం జరిగింది. అయినప్పటికీ సిగ్నల్ లేకపోవడంతో సిగ్నల్ కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఉదయం 12 గంటలకు ఆగిపోయిన సిగ్నల్ తిరిగి రెండు గంటలకు సిగ్నల్ అందింది. దీంతో హమయ్యా అంటూ ఊపిరిపీల్చుకున్నారు. రెండు గంటల పాటు నెట్‌వర్క్ లేక ఇబ్బందులకు గురయ్యారు. అన్ని ప్రాంతాల్లో ఇదే విధంగా జరిగినట్లుగా చెప్తున్నారు.

ఏకీకృత పింఛను వద్దు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ 1938 సంఘ నాయకులు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 1 : కేంద్ర ప్రభుత్వం అమలు చేయ తలపెట్టిన ఏకీకృత పింఛన్ పథకాన్ని వ్యతిరేకిస్తూ ఏపీటీఎఫ్, ఏపీటీఎఫ్ 1938 ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరులో వేర్వేరుగా ధర్నా, సమావేశాలు జరిగాయి. కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఏపీటీఎఫ్ 1938 జిల్లా నాయకులు జి.కృష్ణ, రత్నంబాబు, మోహన్ మాట్లాడుతూ యూపీఎస్ పేరుతో కేంద్ర ప్రభుత్వం పింఛన్ విధానాలను తీసుకురావడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుని వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక 'ఇష్ట' జిల్లా కార్యాలయంలో జరిగిన ఏపీటీఎఫ్ జిల్లా సబ్ కమిటీ సమావేశంలో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర మాట్లాడుతూ పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించేవరకు ఏపీటీఎఫ్ పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసిన జీవో 117 ఉత్తర్వులను రద్దు చేయకుండా సర్‌ప్లస్ టీచర్ల పేరుతో సర్దుబాట్లు చేయడం తగదన్నారు. ఆయా కార్యక్రమాల్లో సంఘ నాయకులు శాస్త్రి, రమాదేవి, ప్రకాష్, జగదీష్, దొరబాబు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, రాజు, దుర్గారావు, సురేష్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాటదారుడికి రేవు అప్పగింత

నరసాపురం, సెప్టెంబర్ 1: మాధవాయిపాలెం రేవును ఆదివారం కొత్త పాటదారుడికి అప్పగించారు. జూలై మూడు నుంచి రేవు నిర్వహణను మండల పరిషత్ నిర్వహిస్తూ వస్తోంది. ఇటీవల నిర్వహించిన వేలంలో యలమంచిలి మండలం కనకాయలంక సొసైటీ రేవును రూ 2.98 లక్షలకు పాడుకుంది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ ఒకటి నుంచి అప్పగించాల్సి ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో ఉదయం ఐదు గంటలకు ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు, సిబ్బంది సురేష్ పాటదారుడికి రేవును అప్పగించారు.

మంత్రి లోకేశ్ దృష్టికి 'అపుస్మా' సమస్యలు : ఎమ్మెల్యే రోషన్‌కుమార్

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక



'అపుస్మా' జిల్లా నూతన కార్యవర్గ నాయకులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్,తదితరులు

చింతలపూడి/ఏలూరు అర్బన్, సెప్టెంబరు 1: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (అపుస్మా) సమస్యలను విద్యాశాఖా మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువస్తానని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ భరోసా ఇచ్చారు. అపుస్మా ఏలూరు జిల్లా సంఘ సమావేశం చింతలపూడిలో ఆదివారం జరిగింది. సంఘ నాయకులు ఆయనకు స్వాగతించి సత్కరించగా జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన మాట్లాడారు. అపుస్మా పాఠశాలల సమస్యలు, పాఠశాల యాజమాన్యం నుంచి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ 42 శాతం విద్యను రాష్ట్రంలో బడ్జెట్ స్కూల్ రూపంలో అందిస్తున్నామని, ప్రైవేట్ విద్యా సంస్థలు పోటీ కాదని, ప్రభుత్వంతో కలిసి విద్యాభివృద్ధికి తాము తోడ్పడుతున్నామన్నారు. అనంతరం అపుస్మా జిల్లా శాఖ నూతన కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. వివరాలను ఏలూరులోని పత్రికలకు సంఘ నాయకులు విడుదల చేశారు. సంఘ జిల్లా నూతన అధ్యక్షుడిగా హయగ్రీవ విద్యాసంస్థల డైరెక్టర్ ఎం.శివ కుమార్ శర్మ, కార్యదర్శిగా ఎన్ఆర్‌కే ప్రసాద్, కోశాధికారిగా కె.రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలోని 600 ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు, కరస్పాండెంట్లు హాజరయ్యారని వివరించారు. అపుస్మా రాష్ట్ర అదనపు కార్యదర్శి డాక్టర్ ఎంబీఎస్ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.తులసి విష్ణుప్రసాద్, జోన్-2 ప్రాంతీయ అధ్యక్షుడు జంగా బాలాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సహ అధ్యక్షుడు జి.బుల్లబ్బాయ్ తదితరులు హాజరయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

విరాళాల వివరాలు సక్రమంగా ఉండాలి



భీమవరం టౌన్, సెప్టెంబరు 1 : శ్రీమావుళ్ళమ్మకి భక్తులు సమర్పించిన విరాళాల వివరాలు సక్రమంగా ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) హెచ్చరించారు. శ్రీమావుళ్ళమ్మవారి స్వర్ణ వస్త్రానికి పట్టణానికి చెందిన రెడ్డి శివశంకర్, రాధారాణి దంపతులు 15 గ్రాముల బంగారాన్ని ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా ఆదివాకం దేవస్థానంకు అందజేశారు. ఈ సందర్భంలో భక్తులందించే విరాళాల వివరాలను పరిశీలించి ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విరాళాలు అందించే భక్తుల పూర్తి వివరాలతో రికార్డులుండాలని, సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవన్నారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడ కొండచరియ విరిగిపడిన ఘటనలో..

యువతి మృతి.. తల్లిదండ్రులకు తీవ్ర గాయాలు

ముదినేపల్లి, సెప్టెంబరు 1 : విజయవాడలో శనివారం కొండ చరియలు విరిగి పడిన ఘటనలో ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామానికి చెందిన నవుడు మేఘన (24) అనే యువతి మరణించింది. ఈమె విజయవాడలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో క్రెడిట్ కార్డు సెక్షన్‌లో పని చేస్తున్నది. తల్లిదండ్రులతో సహా ఈమె అక్కడే నివాసం ఉంటోంది. మరో పది నిముషాల్లో ఇంటి నుంచి బ్యాంకుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో కొండ చరియలు విరిగి పడి ఆ యువతి మృత్యువాత పడింది. మృతురాలి తల్లిదండ్రులకు కూడా తీవ్ర గాయాలై నడవ లేని స్థితిలో ఉన్నారు. ఈ ఘటన వణుదుర్రు వాసులను విషాదంలో నింపింది. ఆదివారం మేఘన అంత్యక్రియలను వణుదుర్రులో నిర్వహించారు. ఆమె తల్లిదండ్రుల వేదన చూపరుల హృదయాలను కలచి వేసింది. పలువురు మేఘన కుటుంబాన్ని పరామర్శించారు.

తిరుపతి రైలు ఆకస్మిక రద్దు

- రాజమండ్రిలో నిలిపివేత
- 1500 మంది ప్రయాణికుల అగచాట్లు




రాజమండ్రిలో వెనుదిరుగుతున్న ప్రయాణికులు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా తిరుపతి వెళ్లే ప్రయాణికులకు ఆటంకం ఏర్పడింది. గన్నవరం-విజయవాడ మధ్య రైల్వే ట్రాక్ నీట మునగడంతో కాకినాడ నుంచి రేణిగుంట (తిరుపతి) వెళ్లే రైలు రాజమండ్రిలో రద్దు చేశారు. రైల్వే ఆకస్మిక నిర్ణయంతో దారి మధ్యలోనే ప్రయాణం ఆగిపోవడంతో ఉసూరుమన్నారు. సాధారణంగా తిరుమలకు వివిధ ప్రాంతాల నుంచి బృందాలుగా ఏర్పడి వెళుతుంటారు. దీంతో మరింత ఇబ్బంది పడ్డారు. కాకినాడ నుంచి రేణిగుంట (తిరుపతి) వెళ్లే రైలు కాకినాడ నుంచి ఆదివారం సాయంత్రం బయలు దేరింది. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో రాజమండ్రి చేరుకుంది. ఎంత సేపటికీ బయలు దేరకపోవడంతో ప్రయాణికుల్లో ఆందోళన మొదలైంది. రైలును దారి మళ్లిద్దామనుకొని తాడేపల్లిగూడెం, ఏలూరు ప్రయాణికులు దిగిపోవాలని చెప్పారు. కానీ రైలును రద్దు చేస్తున్నట్టు 6.30 గంటల సమయంలో ప్రకటించారు. 11 స్లీపరు, ఆరు ఏసీ, రెండు జనరల్ బోగీల్లో సుమారు 1500 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో 90 శాతం మంది తిరుమల వేంకటేశ్వరుడి దర్శనానికి వెళ్లేవారు. రైలు ఆకస్మిక రద్దు ప్రకటనతో దర్శనం కోల్పోయామనే బాధ ప్రయాణికుల్లో కనిపించింది. కొందరు ప్రయాణి కులు రైల్వే స్థానిక సిబ్బందితో వివాదానికి దిగారు. టీసీ ఐ.చంద్రమౌళి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. టికెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా విధించినట్లే రైలును ఆకస్మికంగా దారి మధ్యలో నిలిపేస్తే తమకూ పరిహారం చెల్లించాలని వాదించారు.

రిఫండ్‌కీ ఇబ్బందే

మాన్యువల్‌గా రిజర్వేషను టికెట్లు తీసుకున్నవాళ్లు రిఫండ్ కోసం రిజర్వేషను కౌంటర్ల వద్దకు వెళ్లాలని సిబ్బంది సూచించారు. అయితే అక్కడ మూడే కౌంటర్లు ఉండడం, రాజమండ్రి రిజర్వేషను కార్యాలయంలో తీసుకున్న టికెట్లను మాత్రమే రద్దు చేస్తామని చెప్పడంతో ప్రయాణికులు మరీ నీరసించిపోయారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి మరీ బాధించింది. తిరుగు ప్రయాణంలో టికెట్లు ఉన్నవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆ టికెట్లకు క్యాన్సిలేషన్ చార్జీలు వసూలు చేయకుండా చూడాలని కోరారు.

ఇరువురి మధ్య ఘర్షణ.. ఒకని మృతి



మృతుడు సైకం నాగరాజు

భీమవరం క్రైం, సెప్టెంబరు 1 : ఇరువురు మధ్యతలెత్తిన వివాదం ఒకరు మృతికి దాకితీపింది. టూ టౌన్ సీఐ కాళీచరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉనాయి. భీమవరంలోని గరగపర్రురోడ్డులో సైకం నాగరాజు అనే వ్యక్తికి టింక్కరింగ్ షాపు ఉంది. ఆ పక్కనే ఉన్న పెయింటింగ్ షాపులో గతంలో ఆకుల తులసీ వరప్రసాద్ (నాని) అనే వ్యక్తి పనిచేసేవాడని, అక్కడ మాని వేశాడని, అతను మద్యానికి బానిసై తగాదాలు పడుతూ ఉంటాడాన్నారు. గతంలో చాలాసార్లు నాగరాజువద్దకు వచ్చి వరప్రసాద్ సోమ్ములు డిమాండ్ చేసేవాడని, ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో షెడ్డు వద్దకు వచ్చి సోమ్ములు కావాలని అడగడంతో నాగరాజు నీకు ఎందుకు ఇవ్వాలనడంతో తులసీ వరప్రసాద్ వెళ్ళిపోయాడన్నారు. రాత్రి 8.30 ప్రాంతంలో మరలా వచ్చిన వరప్రసాద్ నాగరాజుతో ఘర్షణకు దిగి వెంటన తెచ్చుకున్న కత్తితో నాగరాజు పొట్టలో పొడిచాడన్నారు. వెంటనే నాగరాజు కూడా షెడ్డులో ఉన్న ఇనుపరాడ్‌తో వర ప్రసాద్ తలపై బలంగా కొట్టాడాన్నారు. దీంతో స్థానికంగా ఉన్న కొందరు షెడ్డు వద్దకు చేరుకుని గాయాలబారిన పడిన ఇరువురిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఐతే అప్పటికే నాగరాజు (34) మృతి చెందగా, వరప్రసాద్ తీవ్ర గాయాలతో కోమాలో ఉన్నాడని సీఐ తెలిపారు. కేసును టూటౌన్ సీఐ కాళీచరణ్ దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

స్విమ్మింగ్ పూల్‌లో దిగి ఒకరి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 1 : స్విమ్మింగ్ పూల్‌లో దిగిన యువకుడు ఈత రాకపోవడంతో మృతి చెందాడు. ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన అక్కినేని నగేష్ (32) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వేరేవారి పిల్లలను వట్లూరులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌కు తీసుకువెళ్తూ ఉంటాడు. ఆదివారం కూడా తీసుకు వెళ్ళాడు. అతను కూడా స్విమ్మింగ్ పూల్ దిగి లోతుకు వెళ్ళాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. అపస్మారక స్థితికి వెళ్ళగా వెంటనే ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్ళారు. అప్పటికే మృతి చెందాడని నిర్ధారించి ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 1 :రోడ్డుపై నడిచి వెళ్తున్న ఒక వృద్ధుడిని ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురై ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తర లిస్తు ండగా మార్గమధ్యలో మృతి చెందాడు. నల్లజర్ల మండలం పోతవరం గ్రా మానికి చెందిన గోవాడ గంగరాజు (60) గత నెల 31వ తేదీ రాత్రి గ్రామం లో రోడ్డుపై నడిచి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన దివ్యాంగ ఆ టో డ్రైవర్ తన ఆటోతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన గంగరాజును ఏలూరు ప్రభుత్వాస్పతికి శనివారం అర్ధరాత్రి తరలించారు. ఆస్పత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని చెప్పారు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహన్ని బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగ అరెస్టు... బంగారం, వెండి స్వాధీనం

పోలవరం సెప్టెంబరు 1 : మండలంలో పలు ప్రాంతాల్లోని ఇళ్ళలో దొంగతనాలు చేసిన దొంగను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. తాళాలు బద్దలు కొట్టి ఇళ్లల్లోకి ప్రవేశించి బీరువాల్లోని బంగారం, వెండి చోరీలకు పాల్పడిన కేసులలో దర్యాప్తు చేశామన్నారు. పోలవరం మండలం గూటాల పంచాయతీ మహాలక్ష్మి పేటకి చెందిన తాడి దుర్గారావు అనే వ్యక్తిని అరెస్టు చేసి విచారించగా నాలుగు చోట్ల దొంగత నాలకు పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. 2023 జూన్‌లో గూటా శివయ్య స్వీట్ షాపు యజమాని ఇంట్లో, 2023 ఆగస్టు, డిసెంబరులో, 2024 ఆగస్టులో పలు ఇళ్ళలో దొంగతనాలకు పాల్పడ్డాడని తెలిపారు. చోరీ చేసిన బంగారం, వెండి ముత్తూట్, మణప్పురం, అమృతాగోల్డ్ వంటి సంస్థలలో తాకట్టు పెట్టడం అమ్మడం చేసి డబ్బు చేసుకుని వ్యసనాలకు ఖర్చు చేయ డం చేసేవాడని తెలిపారు. మొత్తం కేసులలో 360 గ్రాముల బంగారం, 452 గ్రాముల వెండి వస్తువులు దొంగిలించబడ్డాయని, నిందితుడి వద్ద 48 గ్రాముల బంగారం, 252 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామి తెకలిపారు. సీఐ బాల సురేష్ బాబు, ఏఎస్ఐ నాగేశ్వరరావు, రైటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గేదెలు మొక్కలు తినేశాయని.. ఒకరిపై ఒకరు కేసులు

లింగపాలెం, సెప్టెంబరు 1: గేదెలు వచ్చి ఇంట్లోని మొక్కలను తినివేశాయని, ఇద్దరు వ్యక్తులు కొట్టుకున్న ఘటన లింగపాలెం శివారు కల్యాణంపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలం, లింగపాలెం శివారు కల్యాణంపాడుకి చెందిన ఇద్దరు వ్యక్తులు తమ ఇంట్లోకి గేదెలు వచ్చి మొక్కలు తినేశా యని గొడవపడడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వీరు ఇరువురు పరస్పరం ఒకరి పై ఒకరు కేసులు పెట్టుకున్నారని ఎస్సై వెంకన్న తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం సెప్టెంబరు 1 : కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్త, మరో ఇద్దరిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే జబీర్ తెలిపారు. కుర్సం నవ్య సింధూర్ పెద్దల సమక్షంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త సింధూర్ మద్యానికి బానిసై నవ్యను శారీరకంగాను, మానసికంగాను వేధిస్తుండడంతో నవ్య పిల్లలతో జంగారెడ్డిగూడెం వచ్చి నివాస ముంటు న్నారు. గత నెల 29న నవ్య దగ్గరకు ఆమె భర్త సింధూర్ మద్యం సేవించి వచ్చి డబ్బులిస్తావా లేదా అంటూ పిల్లలను తీసుకువెళ్తుండగా అడ్డుకున్న నవ్యను సింధూర్ రాడ్డుతో కొడుతుండగా నవ్య చెయ్యి అడ్డు పెట్టగా ఆమె ఎడమ కంటికి తగిలి గాయమైంది. ఆమె ఫిర్యాదు మేరకు తనను అదనపు కట్నం కోసం వేధిష్తున్నారంటూ ఆమె భర్తతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జామాయిల్ తోట ధ్వంసం.. కేసు నమోదు

జంగారెడ్డిగూడెం సెప్టెంబరు 1 : పట్టణంలోని ఓ మహిళకు చెందిన ఐదెకరాల జామాయిల్ తోటను ధ్వంసం చేసినందుకు ముగ్గురి పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే జబీర్ తెలిపారు. పట్టణంలోని ఆర్ఎస్ నెంబర్ 228-27లో పట్టణానికి చెందిన దండమూడి లక్ష్మీజ్యోతికి ఐదెకరాల జామాయిల్ తోట ఉంది. తమ పొలంలో ఉన్న జామాయిల్ తోటను జేసీబీతో ధ్వంసం చేసిన ముగ్గురిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో.. పెట్రోలు పోసుకుని..

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 1 : మద్యం మత్తులో ఒక వ్యక్తి పెట్రోల్ పోసు కుని నిప్పటించుకున్నాడు. దీంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఏలూరు తంగె ళ్ళమూడికి చెందిన వేల్పూరి ఉమామహేశ్వరరావు (49) ఆదివారం సాయ ంత్రం మద్యం తాగిన పెట్రోల్ తనపై పోసుకుని నిప్పంటించుకున్నా డు. తీవ్ర గాయాలపాలైన అతడిని బంధువులు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘట నపై ఆస్పత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్ పోస్టు పోలీసుల కు సమాచారం ఇచ్చారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఆకివీడు, సెప్టెంబరు 1 : అయి-భీమవరం గూడౌన్స్ దగ్గర ఖాళీ స్థలంలో ఆదివారం పేకాటాడుతున్న నల్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.22,250లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ హనుమంతు నాగరాజు తెలిపారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి చేయాలి


పేదల ఇళ్ళు తొలగించవద్దంటూ కలెక్టర్‌కు సీపీఎం నేతల వినతి

ఆకివీడు, సెప్టెంబరు 1 : ఊళ్లలో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అధికారులు సమష్టి కృషితో పనిచేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆదివా రం తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో విష జ్వరాలు, మరణాలు ఎందుకు వస్తున్నాయని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి శాంపిల్స్‌ను శివారు ప్రాంతంలో ఉన్న కుళాయిల నుంచి సేకరించి పరీక్షలకు పంపాలన్నారు. వ్యవసాయం, హాస్టల్స్‌పై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కందుల వాణి, కమిషనర్ జి.కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

• అయి-భీమవరం రోడ్‌లోని పీడబ్ల్యూడీ స్థలాల్లో ఏభైఏళ్లుగా నివాసముంటూ పక్కా గృహాలు నిర్మించుకున్న తమను ప్రజాప్రతినిధులు తొలగించడానికి రంగం సిద్ధం చేస్తున్నారని, అటువంటిది జరగకుండా చూడాలని తహసీల్దార్ వద్ద కలెక్టర్‌కు సీపీఎం నేతలతో కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్యను పరిశీలిస్తామని ఆమె తెలిపారు.

• వసతి గృహాల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన మెనూ అమలులో అలసత్వం వహిస్తే సహించేదిలేదని కలెక్టర్ నాగరాణి అన్నారు. స్థానిక సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆమె పరిశీలించారు. సౌకర్యాలు ఏలా ఉన్నాయంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలు రుచిగా ఉండాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. వసతి గృహం సమీపంలో మురుగు కనబడడంతో కమిషనర్ కృష్ణమోహన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్వరమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

4న టీచర్లకు మానవత పురస్కారాలు

భీమవరం అర్బన్, సెప్టెంబరు 1 : మానవత భీమవరం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ఉపాధ్యాయులకు మానవత విశిష్ట ఉపాధ్యాయ సేవా పురస్కారాలను ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 4వ తేదీన అందిస్తామని సేవ సంస్థ డైరెక్టరు ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. శ్రీ రమణరాజు అంధుల పాఠశాల ఉపాధ్యాయుడు కాజ భీమేశ్వరరావు, అరుణోదయ మానసిక వికలాంగుల కేంద్రం ఉపాధ్యాయుడు గుల్లంకి బేబీరాణి, చిన్మయి ప్రభనృత్య ఉపాధ్యాయురాలు కె.వరలక్ష్మి, ఆకివీడుకు చెందిన క్రీడాశిక్షకుడు వల్లభాని నాగరాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు దండు సూర్యనారాయణరాజు, కొత్తపూసలమర్రు ఎంపీపీఎస్ స్కూలు ఉపాధ్యాయుడు జి. అబ్రహంకు భీమవరంలోని ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో పురస్కారాలు అందిస్తామన్నారు.

పేద మహిళకు నిత్యావసరాల వితరణ

భీమవరం అర్బన్, సెప్టెంబరు 1 : మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం తాడేరు రోడ్‌లోని ఇందిరమ్మ కాలనీలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న దుర్గమ్మ అనే పేదరాలికి బలభద్ర రవి, మహాలక్ష్మి దంపతులు ఆదివారం పెళ్లిరోజు సందర్భంగా రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు, బస్తా బియ్యం అందించారు. మానవతా సేవ సంస్థ సభ్యులు అల్లు శ్రీనివాస్, గ్రంధి కుమార్ వరప్రసాద్, కె.నరసింహమూర్తి బాబు పాల్గొన్నారు.

'తల్లిదండ్రుల తర్వాత గురువే దైవం'

భీమవరంటౌన్, సెప్టెంబరు 1 :సమాజంలో అన్ని వర్గాల వారితో గౌరవింపబడే వారు ఉపాధ్యాయులని, తల్లిదండ్రుల తరువాత గురువే దైవమని జిల్లా యూత్ హాస్టల్స్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఎం.సత్యానారాయణ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత చరిత్రపై ఐదు రోజులపాటు వేడుకగా నిర్వహిం చడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడు తూ 2, 3వ తేదీల్లో విద్యార్థులకు ఉపాధ్యాయుల సేవలపై పోటీలు, 4న ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తామన్నారు. అరసవల్లి సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఎస్‌కే చాన్ బాషా, భానుమణి, శ్యామల విద్యార్థులు పాల్గొన్నారు.

'మురుగు కాల్వల్లో చెత్త వేయవద్దు'

ఆకివీడు, సెప్టెంబరు 1 : చెత్తను ప్రజలు మురుగుకాల్వలో వేయకూడదని నగర పంచాయతీ పంపించే వాహనాల్లో వేయాలని నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక గంగానమ్మకోడ్‌లో కార్మికులతో చెత్తను తొలగింపచేసి మాట్లాడారు. పరిశుభ్ర వాతావరణానికి జనం సహకరించాలని, లేకపోతే రోగాలు బారిన పడతారన్నారు. కార్యక్రమంలో పుప్పాల పండు, బత్తుల రవి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

కాళ్ళ, సెప్టెంబరు 1 : విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నతస్థానాలు అధిరోహించాలని ఇన్‌ఛార్జి తహసీల్దారు నాగార్జున సూచించారు. ఆదివారం కాళ్ళ బాలుర హాస్టల్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. దీనిలో భాగంగా విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. హాస్టల్‌లో అందిస్తున్న భోజన వసతులను అడిగి తెలుసుకున్నారు. భోజన సౌకర్యాలు బాగోకపోతే తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. హాస్టల్ వార్డెన్ సిబ్బంది ఉన్నారు.

ఇంటింటికి రేషన్ సరుకులు పంపిణీ

ఉండి సెప్టెంబరు 1: ఇంటింటికి కార్డుదారులకు వాహనం ద్వారా సరుకుల పంపిణీ ఆదివారం జరిగిందని మండల సివిల్ సప్లయిస్ డీటీ మహేష్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటికి రేషన్ కార్యక్రమం ఎండీయూ వాహనాలు ద్వారా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందించిన బియ్యాన్ని ఉచితంగా, పంచదార కేజీ రూ.17లకు కార్డుదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. సకాలంలోనే కార్డుదారులు సరుకులను తీసుకోవాలని కోరారు.

వదలని వాన

» ఇంకా ముంపులోనే పొలాలు, లోతట్టు ప్రాంతాలు

నరసాపురం టౌన్, సెప్టెంబరు 1: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పట్టణ, మండలంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. తుఫాన్ ప్రభావంతో ఆదివారం మధ్యాహ్నం వరకు తీరంలో భారీ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మండలంలోని వైఎస్‌పాలెం, రుస్తుంబాద, చిన్నమామిడిపల్లి, మల్లవరం, చిట్టవరం, కొప్పర్రు, లిఖితపూడి, సీతారాంపురం గ్రామాల్లోని వందలాది ఎకరాలు నీట మునిగాయి. వేసిన నారుమడులు, ఆకుమడులు నీట తేలాయి. పలు చోట్ల చెరువుల్ని తలపిస్తున్నాయి. ఇటు పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో మోకాలు లోతు నీరు నిలిచింది. పొన్నపల్లి, చలవపేట, నందమూరికాలనీ, రుస్తుంబాద, ఇందిరమ్మ కాలనీలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ఆదివారం వ్యవసాయశాఖ జేడీ వెంకటేశ్వరావు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. జరిగిన నష్టంపై అధికారులను అడిగి తెలుసుకు న్నారు. చేలలో నీరు నిల్వ లేకుండా రైతులు బయటకు తోడుకోవాలన్నారు. ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి, ఏవో జాన్సన్, సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

• పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పట్టణంలోని పలు వార్డుల్లోని పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. డ్రెయిన్లలోని మురుగునీరుతో పాటు వర్షపు నీరు రోడ్లపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో ఇంతటి వర్షం కురవడం చూడలేదని పలువురు చెబుతున్నారు.



పాలకొల్లు అన్నపూర్ణ థియేటర్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు.. ఇరగవరంలో వర్షం కారణంగా నేలకొరిగిన చెట్టు

• కాళ్ల : ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు శివారు గ్రామాలు నీట మునిగా యి. ప్రధాన రహదారులతోపాటు గ్రామంలోని అంతర్గత రహదారులు కాల్వల ను తలపించాయి. కాళ్ళ గ్రామ శివారు గాంధీనగర్, సీసలి గ్రామ శివారు సత్యనారాయణపురం గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. పంటకాలువ, రోడ్డు ఏకమై నడవడానికి వీలు లేనిపరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోయారు. అధికారులు నాయకులు స్పందించి తమ కష్టాలను తీర్చాలని కోరారు. కాళ్ళలో వరి పొలాలు నీటమునిగాయి. భారీ వర్షాలతో అన్నదాతకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నారుమడులు సైతం మునిగి ఇబ్బందులు పడి, మళ్లీ నాట్లు వేసుకున్న రైతులకు ఈ వర్షం మరింత ఇబ్బందులకు గురి చేసింది.

• ఇరగవరం : ఇరగవరం మండలంలోని పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. ఆదివారం తెల్లవారు జాము నుంచే ఈదురు గాలులతో కూడిన వర్షం ఏకాధాటిగా కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. జగనన్న కాలనీలో నివాసాల చుట్టూ వర్షం నీరు చుట్టుముట్టింది. ఇరగవరం రోడ్డు నుంచి ఏలేటిపాడు వెళ్ళే రోడ్డులో వర్షం కారణంగా నిద్ర గన్నేరు చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. రాకపోకలు నిలిచి వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్ స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తీయించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

మావుళ్లమ్మ ఉత్సవాల నిర్వహణ అభినందనీయం


మావుళ్లమ్మ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, సెప్టెంబరు 1: మావుళ్ళమ్మ జాతర మహోత్సవాలను వాడవాడలా నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. పట్టణంలోని రెస్టు హౌస్ రోడ్డులోని కోదండ రామాలయం వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మావుళ్ళమ్మ జాతర మహోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు కొండ్రు శ్రీనివాస్, గండమాని శివరామ్, కొర్ర రంగ, అయితం నరసింహం, అల్లబోయిన నాగబాబు, దువ్వి వెంకన్న, అప్పన్న, గొలగాని సూర్య చంద్రరావు, బర్ల శివకుమార్, ఎదురి ప్రసాద్, దువ్వి శివకుమార్, అప్పాజీ, నీలాతి రమేష్, బొలగాని రమేష్, బుర్లి మణి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ అధికారి బాలకృష్ణకు అభినందనలు


కర్నేని బాలకృష్ణ

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 1 : పాలకొల్లు పట్టణానికి చెందిన కర్నేని బాలకృష్ణ ఇండియన్ సివిల్ సర్వీసెస్‌లో ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ అడ్వైజర్ ఈస్టర్న్ నావెల్ కమాండ్ హోదాలో పనిచేసి పదవీ విరమణ చేసిన సందర్భంగా పలువురు పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా లక్ష్మీపురానికి చెందిన బాలకృష్ణ తండ్రి చనిపోవడంతో చిన్నతనంలోనే వరుసకు పెదనాన్న గొర్రెల అప్పలస్వామి సలహాతో పాలకొలు వచ్చి చదువుకున్నారు. పలు ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలు రాసి గ్రూప్ 2 ద్వారా డిప్యూటీ తహసీల్దార్ చేస్తూ ఇండియన్ సివిల్ సర్వీస్‌కి ఎంపికయ్యారు. ఉద్యోగ విరమణ సందర్భంగా బాలకృష్ణను పట్టణ ప్రముఖులు ఆదివారం అభినందించారు.

పూర్వం మట్టి వినాయక విగ్రహాలతోనే పూజలు


మట్టి వినాయకుల ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరంటౌన్, సెప్టెంబరు 1 : మట్టి కూడా బంగారమేనని, మట్టిలో మాణిక్యాలు అనే నానుడి ఉందని మా చిన్నతనంలో 70 ఏళ్ల క్రితం వినాయక చవితికి ఊరంతా మట్టి వినాయక విగ్రహాలనే తయారుచేసుకుని పూజలు చేసేవారని మాజీ ఎంపీ భూపతిరాజు విజయ్‌కుమార్‌రాజు సతీమణి కమలకాంత కస్తూరి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మట్టి వినాయక విగ్రహాలనే వాడాలనే అవగాహన కార్యక్రమ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, మంతెన రామలింగరాజు కాంతమ్మ, సీహెచ్ ఝాన్సీ, కె.ఇందిరా మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలను వాడాలని సూచించారు.

బీజేపీ సభ్యత్వాలు నమోదు చేయించాలి

పెంటపాడు, సెప్టెంబరు 1: బీజేపీ సభ్యత్వాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటూ పార్టీ సానుభూతిపరులంతా నమోదు చేయించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదపోలు వీరరాఘవులు ఒక ప్రకటనలో కోరారు. సోమవారం పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రధాని మోదీకి సభ్యత్వం అందజేస్తారన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పిలుపు మేరకు ప్రతి కార్యకర్త తమ ఫోన్ ద్వారా 88000 02024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి సభ్యత్వం తీసుకుని తరువాత వారి బూత్‌లో 25 మందికి వాళ్ళ ఫోన్ ద్వారా సభ్యత్వాలు నమోదు చేయించాలన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న వలవల బాబ్జి.. గొల్లలకోడేరులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం.. తణుకులో కార్మికులకు రెయిన్ కోట్లు అందిస్తున్న ఆరిమిల్లి

విజనరీ నేత సీఎం చంద్రబాబు

» చంద్రబాబు తొలిసారి సీఎం అయి 30 ఏళ్ల సందర్భంగా ఘనంగా వేడుకలు

» కేక్ కటింగ్‌లు, పాలాభిషేకాలు

1995 సెప్టెంబరు ఒకటో తేదీన సీఎంగా చంద్రబాబునాయుడు తొలిసారి ప్రమాణ స్వీకారం చేసి 30వ ఏట అడుగుపెట్టిన సందర్భంగా ఆదివారం పట్టణ, గ్రామాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు.

• పెంటపాడు, సెప్టెంబరు 1: విజన్ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబునాయుడు మాత్రమేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. చంద్రబాబు సీఎంగా పదవి చేపట్టి 30 ఏళ్ల సందర్భంగా అభినందనలు తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌ను సీఎం చంద్రబాబు అభివృద్ధి చేశారన్నారు. నవ్యాంధ్రను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తారన్నారు. చంద్రబాబు హయాంలోనే అమరావతి, పోలవరం పూర్తవుతాయన్నారు.

• తణుకు :మున్సిపల్ కార్మికుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. చంద్రబాబు తొలిసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్లు అయిన సందర్భంగా చేనేత కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళాదేవి ఆర్థిక సాయంతో ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో 225 మంది పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మునిసిపల్ కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వావిలాల సరళాదేవి మాట్లాడుతూ కార్మికులకు సేవ చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లను సత్కరించారు. టీడీపీ నాయకులు కలగర వెంకటకృష్ణ, బసవా రామకృష్ణ, మంత్రిరావు వెంకటరత్నం, వావిలాల పవన్‌కుమార్, తాతపూడి మారుతీరావు, డీఈ కొవ్వూరి ఈశ్వర్ రెడ్డి, బత్తుల వెంకటరమణ, తమరాపు సత్యనారాయణ, పల్లపరావు తదితరులు పాల్గొన్నారు.

• పాలకోడేరు/ఆకివీడు రూరల్ :అనుభవజ్ఞుడైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్మి మరోసారి పట్టం కట్టారని గొల్లలకోడేరు టీడీపీ నాయకుడు కమ్మిలి రాంబాబు, సాలా మల్లేశ్వరరావు అన్నారు. పాలకోడేరు మండలం గొల్లలకోడేరులో టీడీ పీ కార్యాలయం వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచారు. టీడీపీ నాయకులు బత్తిన నాగేశ్వరరావు, బోసురాజు, జుత్తిగ శ్రీను, తంగెళ్ళ శ్రీను, తదితర యువకులు పాల్గొన్నారు. ఆకివీడు మండలం కళింగపాలెంలో కేక్ కట్ చేసి పండుగలా జరుపుకున్నారు. దుంపల జనార్ధన, రాజారావు, బెండి వెంకన్న, రవి, తంగి సత్యం, బాబు, తాండ్ర జ్యోగిరాజు, పొన్నాడ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

• భీమవరం టౌన్:సంఘ సేవకులను ప్రోత్సహించిన వ్యక్తి సీఎం చంద్రబా బు అని సంఘ సేవకుడు చెరుకువాడ రంగసాయి అన్నారు. చంద్రబాబు తొలిసారి సీఎంగా ప్రమాణం చేసి నేటికి 29 సంవత్సరాలైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. భీమవరం వచ్చినప్పుడు, గోదావరి పుష్కరాల్లోను, ఎన్టీఆర్ ట్రస్టు అవార్డు ప్రదానోత్సవంలో తనను పలకరించి సత్కరించారన్నారు. టీడీపీ నాయకులు పులపర్తి శ్రీను పాల్గొన్నారు.

• ఉండి : ఉండి మండలం వెలివర్రులో సీఎం, ఎమ్మెల్యేల ఫ్లెక్సీలకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు ఆధ్వర్యంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కలిదిండి వెంకటకృష్ణంరాజు, ఉపసర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ ముదునూరి రంగరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, బొక్కా రెడ్డియ్య తదితరులు పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా, కనుమూరు రఘురామకృష్ణరాజు ఎమ్మెల్యేగా రావడం తమ అదృష్టమన్నారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ముదునూరి ప్రసాదరాజు, రంగప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.



కళింగపాలెంలో కేక్ కట్ చేస్తున్న తెలుగుదేశం పార్టీ అభిమానులు.. వెలివర్రులో కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపిస్తున్న పొత్తూరి

'స్థలాలిచ్చి పక్కా గృహాలు నిర్మించాలి'

ఆకివీడు, సెప్టెంబరు 1 : లక్షలాది రూపాయలు వెచ్చించి నివాసితులు తమ ఇళ్లను అభివృద్ధి చేసుకుంటే ఇళ్లు తొలగిస్తామని అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతిపాదనలు చేయడం తగదని సీపీఎం పట్టణ అధ్యక్షుడు కె.తవిటినాయుడు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పీడబ్ల్యూడీ నివాసితులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నివాసితులకు స్థలాలు ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మించుకున్న తరువాతనే ఇళ్లు తొలగించే ఆలోచన చేయాలన్నారు. పట్టణ పౌరుల సంక్షేమ సంఘం కన్వీనర్ బొక్కా వర్మ, పెంకి అప్పారావు, బొడ్డుపల్లి రాంబాబు, సందక సూరిబాబు తదితరుల ఉన్నారు.

లోతట్టు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలి

ఆకివీడు, సెప్టెంబరు 1 : లోతట్టు ప్రాంత నివాసితులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం చినకాపవరం మురుగుకాల్వను ఆయన పరిశీలించి మాట్లాడారు. నాలుగు రోజలుగా కురిసిన భారీ వర్షపు నీరు ఎగువ నుంచి వస్తే కాల్వలు ఉప్పొంగవచ్చన్నారు. డీటీ ఫరూఖ్, వీఆర్వోలు, టీడీపీ, జనసేన నాయకులు బొల్లా శేషుబాబు, సుమంత్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

భగ్గేశ్వరంలో 250 మందికి..

పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 1 :భగ్గేశ్వరంలో పట్టణానికి చెందిన తిరుమల హాస్పటల్స్ డాక్టర్ పట్నూరి రమేష్ ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులు, కీళ్ళ నొప్పులు, జ్వరాలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వైద్యపరీక్షల నిపుణులు యాతం రమేష్, పి.రవికుమార్, దొంగ ప్రసాద్, వెంకటరమణ, జీవరత్నం, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బైద్యనాథ్ ఆయుర్వేద కంపెనీ ఆధ్వర్యంలో..

పాలకొల్లు అర్బన్ : స్థానిక రోహిణీ ఆయుర్వేద మెడికల్స్ వద్ద ఆదివారం బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ కంపెనీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ సి.రామలింగేశ్వరశాస్త్రి 75 రోగులను పరీక్షించారు. బైద్యనాథ్ కంపెనీ ప్రతినిధులు కీళ్ళ నొప్పులు, ఆయాసం, షుగర్, అజీర్ణం వంటి వ్యాధులకు మందులు ఉచితంగా అందించారు. కంపెనీ సీనియర్ సేల్స్ మేనేజర్ సాయికృష్ణ, అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ మల్లేశ్వరరావు, ప్రతినిధులు ఎ.భాస్కరరావు, పాండురంగారావు పాల్గొన్నారు.

తణుకులో సంచార శకటంతో..

తణుకు : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంచార శకటం ద్వారా నేత్ర వైద్యుడు డా. హుస్సేన్ అహ్మద్, డా.నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకు, పైడిపర్రు, మండపాక ప్రాం తాల్లో పర్యటించి 8 మందికి ఉచిత వైద్య సేలందించారు. సంఘ సభ్యులు దాట్ల రామరాజు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యుడు గిరజాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి పెమ్మిరాజువారి వీధిలో..

అత్తిలి : అత్తిలి పెమ్మిరాజువారి వీధిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యాధికారి నాగరాజు, యూనిట్ ఆఫీసర్ జి. వెంకటేశ్వరరావు తదితరులు వైద్య సేవలు అందించారు. అత్తిలిలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో వైద్య సేవలందించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మురళి, సిబ్బంది గనిరాజు, నాగేశ్వరరావు, రఘురామ్, ఎ.పద్మావతి, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన వైసీపీ : ఆరిమిల్లి

తణుకు/అత్తిలి, సెప్టెంబరు 1: వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులను పూర్తిగా విస్మరించిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం యనమదుర్రు డ్రెయిన్‌పైన తిరుపతిపురం గ్రామ పరిధిలో అరుదలకోడు ఇన్‌లెట్‌కు కొత్తగా ఏర్పాటు చేస్తున్న గేట్లను ఆయన పరిశీలించారు. గేట్ల పరిస్థితిని కలెక్టర్ నాగరాణి దృష్టికి తెచ్చి రూ. 5.50 లక్షలతో రెండు గేట్లను ఏర్పాటు చేశామన్నారు. పాత గేట్లు పూర్తిగా శిథిలావస్థకు చేరినా గత అయిదేళ్లలో వైసీపీ తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, వయ్యేరు కాలువ వచ్చిన ప్రతిసారి అత్తిలి మండలంలోని తిరుపతిపురం, బల్లిపాడు, వరిఘేడు గ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని వివరించారు. కొత్త గేట్లు ఏర్పాటు వల్ల వయ్యేరు ముంపునకు గురికాకుండా ఉంటుంద న్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు మేలు జరిగిలా అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

7 నుంచి విద్యాగణపతి నవరాత్రి ఉత్సవాలు

భీమవరంటౌన్, సెప్టెంబరు 1 : గునుపూడి విద్యాగణపతి స్వామి 21వ నవరాత్రి మహోత్సవాలు ఈనెల 7న ప్రారంభమై 16వ తేదీన స్వామివారి నిమజ్జనంతో పూర్తవుతాయని గునుపూడి-భీమవరం బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు వేలూరి హనుమ కిరణ్ తెలిపారు. ఆదివారం ఆలయంవద్ద ఉత్సవ పత్రికను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతిరోజు స్వామికి పంచామృత అభిషేకాలు, గరికపూజలు, సాయంత్రం సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 18వ తేదీన అన్నసమారాధన ఉంటుందన్నారు. కార్యదర్శి మారెళ్ళ అఖిలేష్, ఉపాధ్యక్షుడు వేలూరి శేషగిరి, సహ కార్యదర్శి మధిర అయ్యప్ప శర్మ, సభ్యులు పాల్గొన్నారు.

20 మంది రక్తదానం

నరసాపురం టౌన్, సెప్టెంబరు 1: పట్టణంలో ఆదివారం అప్పన్నప్లాజాలో ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ ఫౌండర్ కె.చంద్రసేన గుప్త జయంతి పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 20 మంది రక్తదానం చేశారు. ఈ క్యాంపును దేవత వెంకటసుబ్బారావు, నూలి శ్రీనివాస్, నాగరాజు ప్రారంభించారు. క్లబ్ సభ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అప్పన బద్రి, రాజ్‌కుమార్, రాజగోపాల్, కంచర్ల మురళీ, సతీష్‌కుమార్, వెంకట రమేశ్, చైతన్య, అప్పన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నిగ్రామాల్లో జ్వరాల సర్వే చేస్తున్నాం

భీమవరంరూరల్, సెప్టెంబరు 1 : వాతావరణ మార్పులు, భారీ వర్షాలతో వ్యాపిస్తున్న జర్వాలపై ఎప్పకప్పుడు పర్యవేక్షిస్తున్నామని, అన్ని గ్రామాల్లో జ్వరలపై సర్వే చేస్తున్నామని గొల్లవానితిప్ప పీహెచ్‌సీ వైద్యురాలు అరుణ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ కొత్తపూసలమర్రులో శనివారం దిద్దే ప్రియ డెంగీ లక్షణాలతో పాటు ఇతర ఆరోగ్యసమస్యలతో మృతి చెందిందన్నారు. వంద మంది జ్వరాల బారిన పడినట్టు గుర్తించామన్నారు. వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటున్నామని, అవసరమైన చోట్ల వైద్య శిభిరాలను ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 1: తాడేపల్లిగూడెంలోని 33 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. హౌసింగ్ బోర్డు, పాతూరు, కొండయ్యచెరువు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ప్రాంతాలతో పాటు మోదుగగుంట, గొల్లగూడెం, అప్పారావు పేట, కుంచనపల్లి, మెట్టఉప్పరగూడెం, ఇటుకులగుంట, అమృతపురం, వెంకట్రావుపాలెం, టిడ్కో సబ్ స్టేషన్, కొండ్రుప్రోలు, కేఎస్ఎన్ కాలనీల వినియోగదారులు సహకరించాలని కోరారు.


గణపవరంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ధర్మరాజు.. ఎమ్మెల్యే బొలిశెట్టిని సత్కరించిన ప్రవాసాంధ్రులు.. వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కొత్తపల్లి, బండారు, పొత్తూరి

'పవన్ స్ఫూర్తితో సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలి'

గణపవరం, సెప్టెంబరు 1 :ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆశయ స్ఫూర్తితో కూటమి సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించి నూతన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. పవన్‌కల్యాణ్ పుట్టినరోజు రెండోతేదీన పురస్కరించుకుని ఆదివారం గణపవరం, మొయ్యేరు, వల్లూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ఉంగుటూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త వట్టి పవన్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. జనసేన నాయకులు తోట శ్రీనివాసరావు, కూసంపూడి జగపతిరాజు, తోట పవన్, గంటా పవన్, టీడీపీ నాయకులు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు పాల్గొన్నారు.

• పోడూరు : పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఒకరోజు ముందే ఆదివారం పెనుమదంలో అభిమానులు నిర్వహించడం అభినందనీయమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత కేక్ కట్‌చేసి అక్కడున్న చిన్నారికి, అభిమానులకు పంచారు. జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, సర్పంచ్ తానేటి బాబూరావు, ఎంపీటీసీ మానేపల్లి శ్రీధర్, దేవరపు దొరబాబు, పెన్మెత్స రామభద్రరాజు, జనసైనికులు పాల్గొన్నారు.

• భీమవరంటౌన్ : పవన్ అంటే ప్రతిఒక్కరూ అభిమానించే వ్యక్తి అని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. చిన అమిరం గ్రామంలో కేక్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని, ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మొక్కలను నాటారు జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, వబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో పవన్ పుట్టినరోజు సందర్భంగా అల్లం రమేష్ వాణి దంప తుల ఆధ్వర్యంలో 100 మంది పేదవారికి నిత్యావసర సరుకులను భీమవరం, ఉంగుటూరు ఎమ్మెల్యేలు అంజిబాబు, ధర్మరాజు చేతుల మీదుగా అందించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, అల్లం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• నరసాపురం టౌన్: పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమానులు మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు చేపట్టడం అభినందనీయమని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, టీడీపీ ఇన్‌ఛార్జి రామరాజు, బీజేపీ కన్వీనర్ మేకల సతీష్, జనసేన నాయకులు చాగంటి చిన్న, సునీల్, డాక్టర్ చినమిల్లి ప్రశంసించారు. పట్టణంలోని పవన్ స్కానింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా గుండె వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. భీమవరం గుండె వైద్యులు మద్దాల మహేష్ గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. దివి సత్యన్, కోటిపల్లి వెంకటేశ్వరావు, వలవల నాని వట్టిప్రోలు సతీష్, పోలిశెట్టి సాంబ, నళిని, అరుణ తదితరులు పాల్గొన్నారు.

• యలమంచిలి :పాలకొల్లు టౌన్ హాస్పిటల్స్ సహకారంతో అబ్బిరాజుపాలెం గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. టౌన్ హాస్పిటల్స్ వైద్యులు ముత్యాల విజయదుర్గాప్రసాద్, ఎం.కార్తీక్, బి.శ్రీలక్ష్మీప్రసన్న, ఎన్.శ్రీహర్ష పరీక్షలు చేశారు. శిరిగినీడి ప్రసాదు, పోసింశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• తాడేపల్లిగూడెం అర్బన్ : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా సింగపూర్‌లో ప్రవాసాంధ్రులు ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం ప్రవాసాంధ్రులు బొలిశెట్టిని సత్కరించారు.

• ఆచంట : వల్లూరులో జనసేన పార్టీ నేత తోట సురేంద్ర సహకాంరంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిట్టూరి శ్రీనివాస్, కడిమి ఉమామహేశ్వరరావు, తోట ఆదినారాయణ, కాపవరపు రామకృష్ణ, తోట సురేంద్ర, కట్టుంగ వెంకట ముత్యం, రుద్రరాజు రామరాజు, గుబ్బల దుర్గారావు, నరేష్ పాల్గొన్నారు.